


శుక్రవారం హైదరాబాద్‌లోని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు నివాసానికి వెళ్లిన ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్‌కుమార్, బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శశిపాల్, చేవెళ్ల మండలానికి చెందిన సీనియర్ నాయకుడు శేరి రాజు హోలీ శుభాకాంక్షలు తెలిపారు.
– చేవెళ్ల రూరల్, మార్చి 14

# నా ఫామ్‌హౌజ్ లీజుకిచ్చారు

- కోడి పందేలు నిర్వహిస్తున్న సంగతి నాకు తెలియదు
- ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి
- ఈ కేసులో నాలుగున్నర గంటలపాటు విచారణ చేపట్టిన పోలీసులు



మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌కు వస్తున్న ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి

మొయినాబాద్, మార్చి 14 : మండల పరిధిలోని తోలుకట్టా గ్రామంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో గత నెల 11న పెద్దఎత్తున కోడి పందేలు, కాసినో ఆటలు జరిగాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డిది వ్యవసాయ క్షేత్రం కాగా పోలీసుల నుంచి ఫిబ్రవరి 13న నోటీసులు జారీ అయ్యాయి. తాజాగా గురువారం కూడా నోటీసులను అందుకున్న పోచంపల్లి విచారణ నిమిత్తం మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. సీఐ పవన్‌కుమార్‌రెడ్డి పోచంపల్లిని నాలుగున్నర గంటల పాటు విచారణ చేశారు. పొలం ఎవరికి లీజుకు ఇచ్చారు, లీజు పత్రాలు ఉన్నాయా అని తదితర ప్రశ్నలను సంధించారు. 'మా అల్లుడికి లీజుకు ఇచ్చాను, అతను మరో వ్యక్తికి లీజుకు ఇచ్చాడంట.. ఆ విషయం నాకు కూడా తెలియదు అందులో ఇలాంటి కార్యక్రమాలు జరుగుతాయన్న విషయం నాకు కూడా తెలియదని' ఎమ్మెల్సీ వివరణ ఇచ్చారు. తనకు తెలియకుండా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టినందుకు తాను కూడా వారిపై కేసు పెట్టానని తెలిపారు. గత విచారణలో లీజ్ పత్రాలను కూడా ప్రదర్శించినట్లు పోలీసులకు చెప్పారు. ప్రస్తుతం పత్రాలు తీసుకు రాలేదని పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో భాగంగా ఎప్పుడు విచారణకు పిలిచినా రావడానికి సిద్ధంగా ఉన్నట్లు ఎమ్మెల్సీ తెలిపారు.

# ప్రశ్నిస్తే.. సస్పెన్షనా..?

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడంపై బీఆర్‌ఎస్ శ్రేణుల నిరసనలు
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు
- పలు చోట్ల సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మల దహనం
- నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేసిన పోలీసులు



మొయినాబాద్‌లో ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులను అరెస్టు చేస్తున్న పోలీసులు

మొయినాబాద్, మార్చి 13 : ప్రజల పక్షాన ప్రశ్నిస్తే ప్రభుత్వం ప్రధాన ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేల గొంతు నొక్కుతున్నదని.. ఇలాంటి ధోరణిని ప్రభుత్వం కొనసాగిస్తే తగిన మూల్యం చెల్లించక తప్పదని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శాసనసభ సమావేశాల నుంచి జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌ను నిరసిస్తూ బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం మొయినాబాద్‌లో హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. రహదారిపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇదేమి రాజ్యం.. ఇదేమి రాజ్యం.. దొంగల రాజ్యం.. దోపిడి రాజ్యం అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్ నేతలను సీఐ పవన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు వారిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను, వాగ్దానాలను అమలు చేయాలని అసెంబ్లీలో గళమెత్తిన జగదీశ్వర్‌రెడ్డిని అధికారం బలంతో సస్పెండ్ చేయడం సభా సాంప్రదాయాలకు విరుద్ధమని పేర్కొన్నారు. ప్రధాన ప్రతిపక్ష పార్టీ సూచనలు, సలహాలు తీసుకోకుండా ఏకపక్షంగా సభను నడపాలనే ధోరణి ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. ప్రభుత్వం అవలంబిస్తున్న దుర్మార్గమైన ఆలోచన విధానాలను ప్రజలకు వివరించి ఎండగడతామని చెప్పారు. ఉద్యమాలు, పోరాటాలు చేయడం బీఆర్‌ఎస్‌కు కొత్త కాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుధాకర్‌యాదవ్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

### ప్రశ్నలకు సమాధానం చెప్పలేక..

షాద్‌నగర్ : ప్రజా సమస్యలపై గళమెత్తుతున్న బీఆర్‌ఎస్ మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేసిందని బీఆర్‌ఎస్ నేతలు మండిపడ్డారు. జగదీశ్‌రెడ్డి అక్రమ సస్పెన్షన్‌ను ఖండిస్తూ షాద్‌నగర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను శుక్రవారం దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు బీఆర్‌ఎస్ నేతలు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల నుంచి వస్తున్న ప్రజా సమస్యలు, ప్రశ్నలకు సమాధానం చెప్పలేక మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. ఏడాదిన్నర పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. బడ్జెట్ సమావేశాల్లో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళితే ఓర్వలేక ఉద్దేశపూర్వకంగానే కుట్రలకు పాల్పడుతూ సభ నుంచి బయటకు పంపుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ కవిత, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎంఎస్.నటరాజ్, ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, నాయకులు పాల్గొన్నారు.

### సస్పెన్షన్ అప్రజాస్వామికం

దౌల్తాబాద్ : బీఆర్‌ఎస్ పార్టీ మాజీ జడ్పీటీసీ కోట్ల మహిపాల్, పార్టీ మండల నాయకత్వం ఆధ్వర్యంలో దౌల్తాబాద్‌లోని శివాజీ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రజా సమస్యలపై గళమెత్తుతున్న మాజీ మంత్రిని శాసనసభ నుంచి సస్పెండ్ చేయడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు హామీలను అమలు చేయలేని స్థితిలో ఉన్న సర్కారు అప్రజాస్వామిక చర్యలకు పాల్పడుతున్నదని ఆరోపించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వానికి ఎలా బుద్ధి చెప్పాలో నిర్ణయించుకున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు

ఇబ్రహీంపట్నం : ప్రభుత్వ అసమర్థతను అసెంబ్లీ వేదికగా ప్రశ్నించిన మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని సమావేశాల నుంచి సస్పెండ్ చేయడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని బీఆర్‌ఎస్ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు జెర్కోని రాజు, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజ్‌కుమార్, మున్సిపల్ అధ్యక్షుడు మడుపు శివసాయిలు అన్నారు. జగదీశ్వర్‌రెడ్డి సస్పెండ్‌ను నిరసిస్తూ శనివారం ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. సమస్యలపై పోరాడుతున్న ఎమ్మెల్యేను సస్పెండ్ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజాక్షేత్రంలోకి రేవంత్ రెడ్డి వస్తే ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. సస్పెన్షన్‌కు భయపడేది లేదని.. ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ భరత్‌కుమార్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు భరత్‌రెడ్డి, నాయకులున్నారు.

### కుట్రలు చేస్తున్న ప్రభుత్వం

పరిగి : ప్రశ్నించే గొంతులను నొక్కేందుకు ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు బి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నదని ఆరోపించారు. అసెంబ్లీలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అనని మాటను అన్నట్లుగా చూపి సస్పెన్షన్‌కు ప్రభుత్వం కుట్ర చేసిందన్నారు. ఇందుకు నిరసనగా శుక్రవారం పరిగిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్‌ఎస్ నాయకులు దహనం చేశారు. బీఆర్‌ఎస్ నాయకులను పరిగి పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



పరిగిలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



## ఏజీపీగా గీతావనజాక్షి

మొయినాబాద్, మార్చి 13 : మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని పెద్దమంగళారం గ్రామానికి చెందిన గీతావనజాక్షి కొన్నేండ్లుగా న్యాయవాది వృత్తిని కొనసాగించుకుంటూ వస్తున్నారు. ఒక వైపు న్యాయవాద వృత్తిని కొనసాగించుకుంటూ రాజకీయంగా అవకాశం రావడంతో పదేండ్ల క్రితం గ్రామానికి సర్పంచ్‌గా ఎన్నికై ఆరేండ్ల క్రితం వరకు బాధ్యతలు నిర్వహించారు. న్యాయవాద వృత్తిని కొనసాగిస్తూ ఏజీపీ పోస్టుకు దరఖాస్తు చేసుకోవడంతో ఆమె ఎంపికయ్యారు. చేవెళ్లలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, సమానమైన కేడర్‌లోని ఇతర కోర్టులకు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. చేవెళ్ల కోర్టులో 3 సంవత్సరాలపాటు ప్రభుత్వం తరపున సివిల్ కేసులకు సంబంధించి ఆమె వాదించనున్నారు. ఈ కాలంలో ప్రభుత్వం ఆమెకు రూ.20 వేలు ఏకీకృత గౌరవ వేతనం చెల్లించనున్నది. దళిత కుటుంబంలో పుట్టి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఏజీపీగా నియమితులు కావడంతో గ్రామస్తులు ఆమెపై ప్రశంసలు కురిపించారు. సన్మానం చేసి అభినందించారు.

# ఎన్‌సీడీ సర్వేలో ఏఎన్‌ఎంల కొరత

- స్పెషల్ డ్రైవ్ గడువులోగా పూర్తయ్యేనా..?
- బదిలీ స్థానాలు భర్తీ చేయని కాంగ్రెస్ సర్కార్
- సిబ్బంది కొరతతో ఉన్నవాళ్లపై పనిభారం



సిటీబ్యూరో, మార్చి14, (నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎన్‌సీడీ సర్వే ముందుకు సాగడం లేదు. సిబ్బంది కొరత వల్ల అనుకున్న గడువు లోగా పూర్తి చేస్తామా? అనే సందేహం వైద్యాధికారుల్లో నెలకొంది. కేంద్రమిచ్చిన గడువు లోగా సర్వే పారదర్శకంగా పూర్తి చేయడం కష్టంగా మారింది. సిబ్బంది కొరత తీర్చాల్సిన కాంగ్రెస్ సర్కారు పట్టించుకోవడంలేదు. జిల్లాలోని 30 ఏళ్లు నిండిన వారందరికి ఎన్‌సీడీ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని కేంద్ర వైద్యారోగ్యశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం ఫిబ్రవరి 20 నుంచి మార్చి 31 వరకు ఈ కార్యక్రమం నిర్వహించాలని ఆదేశాలు జారీచేసింది. ఇందులో భాగంగా హైదరాబాద్ జిల్లా వైద్యాధికారులు ఎన్‌సీడీ పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు.

### అధిక పనిభారం పడుతున్నది..

హైదరాబాద్ జిల్లాలో ఎన్‌సీడీ సర్వేలో పాల్గొంటున్న ఆశాలు, ఏఎన్‌ఎంలు సరిపడ లేకపోవడంతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. జిల్లావ్యాప్తంగా సుమారు 260 ఏఎన్‌ఎంలు, 1650 మంది ఆశాలు గతంలో ఉండగా ఇటీవల జరిగిన బదిలీల్లో 128 మంది ఏఎన్‌ఎంలు బదీలపై ఇతర జిల్లాలకు వెళ్లారు. ప్రస్తుతం హైదరాబాద్ జిల్లాలో ఉన్న ఖాళీలను భర్తీ చేయకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. 128 ఖాళీలకుగాను కేవలం 25 మందిని కాంట్రాక్ట్ పద్ధతిలో నియామకం చేసి ఉన్నవారిపై అదనపు పనిభారం మోపుతున్నారు.

### ఆరోపణలొస్తున్నాయి..

జిల్లాలోని ప్రతి ఇంటికి వెళ్లి 30 ఏళ్ల పైబడినవారికి బీపీ, షుగర్, కాన్సర్ వంటి వ్యాధులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. హైదరాబాద్ జిల్లాలో 30ఏళ్లు పైడిన వాళ్లు 20 లక్షలకు పైగా ఉండగా, వారందరికి ఎన్‌సీడీ స్క్రీనింగ్ సర్వే నిర్వహించనున్నారు. వారందరికి బీపీ, షుగర్, కాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి వారి వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. రోగం తీవ్రతను బట్టి స్థానిక యూపీహెచ్‌సీ, ఏరియా, జిల్లా ఆసుపత్రికి వైద్యం కోసం తరలించాల్సి ఉంటుంది. కాని ఎన్‌సీడీ సర్వేలో అనేకమంది వివరాలు చెప్పేందుకు సంకోచిస్తున్నారు. టెస్టులు చేసిన అనంతరం సరిపడ మందులు ఇవ్వడంలేదన్న ఆరోపణలు వినిపిస్తుండటం గమనార్హం.

# దివ్యాంగులకు కార్లు

- వారికి నచ్చినట్టుగా వాహనంలో మార్పులు
- ఆర్టీఏ అవకాశం

సిటీబ్యూరో, మార్చి 14 ( నమస్తే తెలంగాణ ) : దివ్యాంగులు, మరుగుజ్జులు అందరిలా కార్లు నడపడానికి ఆర్టీఏ అధికారులు వెసులుబాటు కల్పిస్తున్నారు. వారికి అనుగుణంగా కార్లకు మరమ్మతులు చేసి వారి కలను నెరవేరుస్తున్నారు. గత ఏడాది నుంచి ప్రస్తుతం వరకు 374 రీమోడలింగ్ వాహనాలు రిజిస్ట్రేషన్ అయ్యాయి. మొదట వాహనాన్ని కొనుగోలు చేయాలనుకున్న వ్యక్తి తనకు అనువుగా ఉన్న వెహికిల్‌ను ఎంపిక చేసుకోవాలి. కొటేషన్ తీసుకోవాలి. ఆన్‌లైన్‌లో దానికి సంబంధించి జీఎస్‌టీ అప్లై చేయాలి. వారంలో కేంద్రం నుంచి అనుమతి పత్రం వస్తుంది. దానిని తీసుకుని షోరూంకు వెళ్లి వాహనాన్ని కొనుగోలు చేస్తారు. ఆ బండిని తీసుకుని నగరంలోని దక్కన్ మోటార్ సైకిల్ అండ్ స్కూటర్ గ్యారేజీ సెంటర్‌కు తీసుకెళ్లాలి. ఈ సంస్థకే రాష్ట్రంలో కార్లను రీమోడల్ చేసే అనుమతి ఉంది. వాళ్లు సదరు వ్యక్తికి అనుగూణంగా క్లచ్, బ్రేకులు, సీటింగ్ విధానాల్లో మార్పులు చేస్తారు. ఆ వ్యక్తితో ట్రయల్ చేయిస్తారు. ఇంకేమైనా మార్పులు ఉంటే మాడిఫికేషన్ చేస్తారు. అందుకు సంబంధించిన వివరాలన్నీ ఆర్టీఏ రికార్డుల్లో నిక్షిప్తం చేస్తారు.

వైన్స్ షాప్‌లో దొంగతనం, యువకుడిని హత్య చేసిన

# నిందితుడికి రిమాండ్

- 24 గంటల్లో హత్య కేసును ఛేదించిన పోలీసులు
- షాబాద్, నాగరగూడ వైన్స్‌లతో పాటు ఇతర ప్రాంతాల్లో చోరీ చేసింది ఒక్కడే..
- విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన రాజేంద్రనగర్ జోన్ డీసీపీ శ్రీనివాస్




హత్య కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడిస్తున్న రాజేంద్రనగర్ జోన్ డీసీపీ శ్రీనివాస్

షాబాద్, మార్చి 14 : వైన్ షాపుల్లో వరుస దొంగతనాలకు పాల్పడుతూ, అడ్డువచ్చిన ఓ యువకుడిని హత్య చేసిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం రాజేంద్రనగర్ జోన్ డీసీపీ శ్రీనివాస్ విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. ఈ నెల 12న అర్ధరాత్రి షాబాద్‌లోని దుర్గా వైన్స్‌లో వెనుక నుంచి రంధ్రం చేసి అందులోకి ప్రవేశించి రూ.40వేల నగదుతో పాటు, మద్యం బాటిళ్లు దొంగిలించి, అది గమనించిన పర్మిట్‌లో పడుకున్న భిక్షపతి అనే వ్యక్తిని హత్య చేసిన సంఘటన పాఠకులకు విదితమే. ఈ విషయమై రాజేంద్రనగర్ జోన్, షాబాద్ పోలీసులు, ఎస్‌వోటీ, సీసీఎస్ బృందాలు సీసీ కెమెరాల ఆధారంగా కేసులో నిందితుడి వివరాలనుగ గుర్తించారు. వికారాబాద్ జిల్లా పూడూరు మండలం పుడుగుర్తి గ్రామానికి చెందిన తుమ్మలపల్లి నరేందర్‌గా గుర్తించిన పోలీసులు శుక్రవారం ఉదయం సీతారాంపూర్ గ్రామంలో నిందితుడిని పట్టుకున్నారు. షాబాద్‌కు చెందిన చేగూరి భిక్షపతి గత రెండు నెలలుగా దుర్గా వైన్‌షాపులో పని చేస్తున్నాడని, అతడు రాత్రి పూట వైన్ షాపులోని పర్మిట్ రూమ్‌లో పడుకునేవాడు. ఈ నెల 12న అర్ధరాత్రి నిందితుడు తుమ్మలపల్లి నరేందర్ దుర్గా వైన్స్ వెనుక నుంచి గోడ దూకి వైన్ షాపు గోడకు ఉల్లి, సుత్తెతో రంధ్రం చేస్తుండగా ఆ శబ్దం విన్న భిక్షపతి పర్మిట్ రూమ్ నుంచి బయటకి వచ్చి నిందితుడిపై అరవడం ప్రారంభించాడు. దీంతో నిందితుడు నరేందర్ భిక్షపతిపై దాడి చేసి పారతో తలపై కొట్టి చంపాడు. ఆ తర్వాత మృతుడి మొబైల్ ఫోన్, జేబులో కొంత నగదును దొంగిలించాడు. ఆ తర్వాత వైన్ షాపు గోడకు రంధ్రం చేసి షాపులోకి ప్రవేశించి సుమారు రూ.40వేల నగదు, కొన్ని మద్యం బాటిళ్లను ఎత్తుకుని అక్కడి నుంచి పారిపోయాడు. నిందితుడి వద్ద ఈ కేసుకు సంబంధించిన ఆస్తిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రూ.29వేలు బ్యాంకులో జమ చేశాడని తెలియడంతో బ్యాంకు ఖాతా స్తంభింపజేశారు. అదే విధంగా డీవీఆర్ రికవరీ చేశారు. నిందితుడు గత సంవత్సరం బహదూర్‌పురా, అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో నాలుగు దొంగతనాల్లో పాత నేరస్థుడిగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల 3న షాబాద్ మండలంలోని నాగరగూడ వైన్ షాపులో దొంగతనానికి పాల్పడింది కూడా ఇతడే అని తేలింది. ఈ హత్య కేసును 24 గంటల్లోగా ఛేదించినందుకు ఎస్‌వోటీ ఇన్‌స్పెక్టర్ శశాంక్‌రెడ్డి, రాజేంద్రనగర్ జోన్, చేవెళ్ల ఏసీపీలు ప్రశాంత్, కిషన్, షాబాద్ సీఐ కాంతారెడ్డి, ఎస్‌వోటీ ఎస్‌ఐ రవికుమార్, వారి బృందాలను ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమణారెడ్డి అభినందించారు.

భూముల అమ్మకంపై వెనక్కి తగ్గేదాకా

# పోరాటం ఆపేదిలేదు

సిటీ బ్యూరో, మార్చి 14 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని అమ్మేందుకు వేలం నిర్వహించాలని తీసుకున్న నిర్ణయంపై వెనక్కి తగ్గేదాకా ప్రభుత్వంపై పోరాటం చేస్తామని విద్యార్థులు తేల్చి చెప్పారు. భూముల అమ్మకంపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు చేయడానికి యూనివర్సిటీ విద్యార్థులు సిద్ధమయ్యారు. హెచ్‌సీయూలోని అన్ని విద్యార్థి సంఘాలు, వర్కర్స్ యూనియన్, నాన్ టీచింగ్ స్టాఫ్ యూనియన్, టీచర్స్ అసోసియేషన్ కలిసి ఉమ్మడిగా జాయింట్ యాక్షన్ కమిటీని ఏర్పాటు చేశారు. యూనివర్సిటీ భూములను రక్షించేందుకు ఉమ్మడిగా పోరాడతామని ప్రకటించారు. భూముల వేలం నిర్వహించి తీరుతామని మంత్రి శ్రీధర్ అంటున్నారని.. అదే జరిగితే ప్రభుత్వంపై యుద్ధం ప్రకటిస్తామని జేఏసీ ప్రతినిధులు స్పష్టం చేశారు. యూనివర్సిటీ భూముల్లోకి ఎవరు అడుగుపెట్టినా తరిమికొడతామని హెచ్చరించారు. హెచ్‌సీయూ భూముల అమ్మడం విద్యార్థులకు అన్యాయం చేయడమే అవుతుందని ఆలిండియా బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు కిరణ్ కుమార్ గౌడ్ అన్నారు. బలవంతంగా అమ్మినా కొన్నవారిని ఆ భూమిలోకి అడుగుపెట్టనీయబోమని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా త్వరలోనే వేలాది విద్యార్థులతో ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ప్రకటించారు. రేవంత్‌రెడ్డి తీరుపై రాహుల్ గాంధీకి ఫిర్యాదు చేస్తామన్నారు.









# సీఎంపై చర్యలు తీసుకోండి

బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డిపై ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ శుక్రవారం ఫిల్మ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో, అలాగే బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో నేతలు ఓయూ పీఎస్‌లో ఫిర్యాదులు చేశారు.

# పరీక్షల వేళ .. ట్రాఫిక్ రద్దీ..!

సిటీబ్యూరో, మార్చి 14 (నమస్తే తెలంగాణ) : ఇంటర్మీడియెట్ పరీక్షలు జరుగుతున్న వేళ విద్యార్థులు, సాధారణ వాహనదారులు ట్రాఫిక్ సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంటర్ పరీక్షలు పూర్తికాగానే పదో తరగతి పరీక్షలు కూడా ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే ప్రతి రోజూ అనేక మంది విద్యార్థులు ట్రాఫిక్‌లో చిక్కుకొని పరీక్షలకు వెళ్లే సమయంలో ఆందోళనకు గురవుతున్నారంటూ తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూకట్‌పల్లి, బోయిన్‌పల్లి, సికింద్రాబాద్, ఎస్‌ఆర్‌నగర్, ఖైరతాబాద్, మెహిదీపట్నం, హబ్సిగూడ, ఉప్పల్, దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట్, ఎల్బీనగర్, వనస్థలిపురం తదితర ప్రాంతాల్లో ఇలాంటి సమస్యను విద్యార్థులు ప్రతి రోజూ ఎదుర్కొంటున్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ ఉన్నతాధికారులు సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్నా.. క్షేత్ర స్థాయిలో వాటిని కొందరు అధికారులు అమలు చేయకపోవడంతోనే ఇబ్బందులు ఎదురవుతున్నాయని విమర్శలొస్తున్నాయి.

